# మాట్లాడుకోవాలి

*B.V.R Prasad Murthy*

This page uses Unicode. If your computer does not display Telugu script, please read and enjoy the pdf version. If you would like to set your computer up to display Telugu Unicode, please see help here

మాట్లాడుకోవాలి
మెత్తగా బత్తాయి పండు తొనలువిప్పినట్టు
మనసువిప్పి మాట్లాడుకోవాలి.

గుండెలోపలికి చేతులు పెట్టి బయటకుతీసిన మాటల్ని
షవర్‌బాత్ చేయించి
ఫ్రెష్‌గా ఎదుటివాళ్ళముందుంచాలి

మాటలేకదా
అమ్మా నాన్నా గురువూ సంఘం
వీళ్ళంతా నీళ్ళుపోసి పెంచిన మాటలే కదా
అంతా చేయిపట్టుకునిలబెట్టిన మాటలే కదా

మాట్లాడితే
అందరికీ కృతజ్ఞతతో అభివాదం చేస్తున్నట్టుండాలి
అప్పుడే స్నానమాడిన రెండు తడిదేహాలు
తమకంగా కౌగలించుకున్నట్టుండాలి
మాట్లాడితే
శుభ్రంగా మంచు కడిగిన నిలువెత్తు అరిటాకుమీద
ఆత్మీయులకోసం నిన్ను నువ్వు వొడ్డించుకున్నట్టుండాలి

మాటకు బొమ్మేకాని బొరుసులేదు
మాటకు వెలుగేకాని చీకటిలేదు

మనుషుల్లా మాట్లాడుకోవాలి
అందరిముందు నిన్ను నువ్వు గ్రుమ్మరించేసుకుని

శూన్యంగా చిద్విలాసించాలి
తొడుగుల్లేని మాటల్ని జేబుల్నిండా నింపుకుని

గృహదేహాల నుండి బయటపడాలి

ఇంట్లోనైనా వీధిలోనైనా
ఆఫీసులోనైన పార్లమెంటులోనైనా
ప్రేమకోసం స్నేహం కోసం
శాంతికోసం మాట్లాడుకోవాలి

పంజరంలోనుండి పక్షిని వదిలేసినట్టుండాలి

కొళాయితిప్పితే నీళ్ళురికినట్టుండాలి

నీ నుండి ఏమీ ఆశించని ఓ చిట్టిపాప

చటుక్కున నీ బుగ్గని ముద్దుపెట్టుకున్నట్టుండాలి

మాటలే కదా
మాటలంటే మనుషుల మనసులే కదా
దయచేసి
మాటని మార్కెట్ చేయొద్దు.

---

Post your comments on this article